క్లుప్తంగా

నిరుపేదలకు నిత్యావసరాల పంపిణీ



తెనాలిరూరల్: రూరల్ మండలం కొలకలూరు గ్రామంలోని కాలువకట్టలపై నిరాశ్రయులుగా జీవిస్తున్న నిరుపేద గిరిజనులకు ట్రైబల్స్ ఛారిటబుల్ ట్రస్ట్ తరపున బుధవారం నిత్యావసరాలను పంపిణీ చేశారు. అనంతరం రైల్వే స్టేషన్ సమీపంలో భారీ వర్షాల కారణంగా తలదాచుకున్న సంచార కుటుంబాలకు దుప్పట్లు, చాపలను అందజేశారు. ట్రస్ట్ చైర్మన్ రావూరి అంజలి, డైరెక్టర్ రావూరి సురేష్ బాబు, వాలంటరీలు ఇంటూరి విజయభాస్కర్, బందెల పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ ఏసీపీలు బదిలీ

తెనాలిఅర్బన్: తెనాలి మున్సిపల్ అసిస్టెంట్ సిటీ ప్లానర్‌లు సుధాకర్, సుబ్బారావులు బదిలీ అయ్యారు. ఈమేరకు ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. సుధాకర్‌ను ఒంగోలుకు, సుబ్బారావును విజయవాడలోని సీఆర్‌డీఏ కార్యాలయంకు, టీపీఎస్ సునీల్‌ను కందుకూరు మున్సిపల్ కార్పొరేషన్‌కు బదిలీ చేశారు. వారి స్థానంలో ఏసీపీగా విజయవాడ సీఆర్‌డీఏలో పనిచేస్తున్న శివన్నారాయణను, ఒంగోలులో టీపీవోగా పనిచేస్తున్న సాంబశివరావును తెనాలికి బదిలీ చేశారు. అలాగే డీఈ నాగభూషణంను గుంటూరుకు, బాపట్లలో పనిచేస్తున్న శ్రీనివాసరావును తెనాలికి డీఈగా బదిలీ చేశారు. వీరందరు కొద్దిరోజుల్లో విధులలో చేరే అవకాశం ఉంది.

పండిట్ దీన్‌దయాళ్‌కు ఘన నివాళి



తెనాలిరూరల్: పండిట్ దీన్ దయాళ్ ఉపాధ్యాయ జయంతి సందర్భంగా తెనాలి రూరల్ మండలం అంగలకుదురు గ్రామంలో బీజేపీ నాయకులు ఆయనకు ఘనంగా నివాళులర్పించారు. గ్రామ సెంటరులో జరిగిన కార్యక్రమంలో ఆ పార్టీ అసెంబ్లీ కన్వీనర్ కటారి వాసుదేవ నాయుడు, రూరల్ మండల అధ్యక్షుడు కడియాల నందకిషోర్, వై కామేశ్వరరావు, కొవ్వూరు శ్రీనివాసు, డాక్టర్ జార్జ్, యోగానంద కిషోర్, మంద జనార్దన్ తదితరులు పాల్గొన్నారు.

పేదలకు దుప్పట్లు పంపిణీ



తెనాలిఅర్బన్: ఫ్రూట్ మినిస్ట్రీస్, కడవరి సందేశం ఆధ్యాత్మిక మాస పత్రిక సిల్వర్ జూబ్లిని పురస్కరించుకుని పెదరావూరులోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కమ్యూనిటీ హాలులో బుధవారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. పలువురు వైద్యులు వైద్య పరీక్షలు చేసి రోగులకు మందులు పంపిణీ చేశారు. అనంతరం పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సంస్థ అధ్యక్షుడు పాస్టర్ తుమ్మల ప్రశాంతరాజు, సంఘ సభ్యులు పాల్గొన్నారు.

30న సీఐటీయూ ఆధ్వర్యంలో 'చలో గుంటూరు'



తాడేపల్లి రూరల్: వైద్య, ఆరోగ్య, మున్సిపల్, విద్యుత్, విద్య తదితర రంగాల్లో తక్కువ జీతాలకు పనిచేస్తున్న కార్మికులు, ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఈ నెల 30న 'చలో గుంటూరు' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు సీఐటీయూ తాడేపల్లి పట్టణ కార్యదర్శి వేముల దుర్గారావు తెలిపారు. ఈ సందర్భంగా గుంటూరు వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో నిర్వహించనున్న కార్యక్రమంలో కార్మికులంతా పాల్గొని జయప్రదం చేయాలని ఆయన కోరారు. ప్రకాష్‌నగర్ సీఐటీయూ కార్యాలయంలో బుధవారం 'చలో గుంటూరు' కరపత్రాల్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా దుర్గారావు మాట్లాడుతూ మున్సిపల్ రంగంలో ఒకేరకమైన పారిశుద్ధ్య పనులు నిర్వహిస్తున్న వారికి సమాన వేతనాలు అమలు చేయడం లేదని తెలిపారు. రెండు సంవత్సరాలుగా కొబ్బరి నూనెలు ఇవ్వకుండా ఆరు నెలలకు మాత్రమే చెల్లించి చేతులు దులుపుకున్నారని విమర్శించారు. వైద్య, విద్యుత్ రంగాల్లో రూ. 15 వేలు, రూ. 18 వేలు మాత్రమే జీతాలు చెల్లిస్తున్నారని తెలిపారు. ప్రైవేటు రంగాల్లోనూ కనీస వేతనాలు అమలు జరగడం లేదని పేర్కొన్నారు. కనీస వేతనాలు అమలు కాని కార్మిక, ఉద్యోగులంతా 'చలో గుంటూరు'కు తరలిరావాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కె. వెంగమ్మ, ఎం. కామాక్షి, బూరగ వెంకటేశ్వర్లు, కె. స్టీఫెన్, వై. యెహోషువా, ఆశీర్వాదం, వి. శాస్త్రి పాల్గొన్నారు.

ఆరు దశాబ్దాల వైభవం

తెనాలి మహిళా మండలి

ఆరు దశాబ్దాలుగా తెనాలిలో మహిళాభ్యుదయానికి, మహిళలందరినీ ఒకతాటిపైకి తీసుకువచ్చేందుకు.. వారిలో ఆర్థిక పరిపుష్టికి దోహదపడిన సంస్థ తెనాలి మహిళా మండలి. 1964లో ఆరంభమైన ఈ మండలిలో ఎన్నో కార్యక్రమాలు శోభాయమానమై విరాజిల్లాయి. అన్ని కార్యక్రమాలకు అప్పట్లో ఈ మండలి భవన సముదాయమే వేదికగా నిలిచింది. ఎన్నో ఏళ్లుగా సేవలందించిన ఈ భవన సముదాయ నిర్వహణ నేడు భారంగా మారడంతో నిర్వాహకులు ఆ బాధ్యతను ప్రభుత్వానికి అప్పజెప్పారు.

- ఇక చరిత్రకే సరి... ఆ ప్రాభవం
- భవనాన్ని ప్రభుత్వానికి అప్పగించిన సభ్యులు



మహిళా మండలి భవనం



తొలి అధ్యక్షురాలు డాక్టర్ చలసాని ఝాన్సీవాణి



ప్రస్తుత అధ్యక్షురాలు డాక్టర్ ముద్దన కస్తూరిబాయి

తెనాలి: మహిళల ఐక్యతకు, వివిధ అంశాల్లో శిక్షణకు, సమాజ చైతన్యానికి ఎంతగానో తోడ్పడిన తెనాలిలోని మహిళా మండలి ఆరు దశాబ్దాల చరిత్ర ఇక గతవైభవమే. ఈ భవనాన్ని రాష్ట్ర ప్రభుత్వానికి అప్పగిస్తూ పాలకవర్గం నిర్ణయం తీసుకుంది. భూమితో కలిపి రూ.3 కోట్ల విలువైన మండలి భవనాన్ని ఆ ప్రకారం రిజిస్ట్రేషను చేయించి సంబంధిత పత్రాలను, భవనాన్ని రాష్ట్ర ఆహార, పౌరసరఫరాలశాఖ మంత్రి నాదెండ్ల మనోహర్‌కు అధికారుల సమక్షంలో అందజేశారు. మహిళా కార్యకలాపాల కోసమే వినియోగించాలని విజ్ఞప్తి చేశారు.

స్థానిక కొత్తపేటలోని సరోజినినాయుడు వీధిలో 1964 జనవరి 23న మహిళా మండలి ఆవిర్భవించింది. ప్రథమ అధ్యక్షురాలు డాక్టర్ చలసాని ఝాన్సీవాణి, కార్యదర్శి బోయపాటి సుభద్రాదేవి హయాంలో మండలి అభివృద్ధి చెందింది. అప్పట్లో రూ.250 విరాళంతో శాశ్వత సభ్యులుగా చేరిన డాక్టర్ పి.రాజ్యలక్ష్మి, నన్నపనేని జ్యోతిష్మతి, కుర్రా అన్నపూర్ణమ్మ, వి.శైలజ, గోగినేని అంబుజాక్షి, తడవర్తి రాజశ్యామల, డాక్టర్ చలసాని ఝాన్సీవాణి, కాసరనేని అనసూయ, యలవర్తి ఇందిర, ఆదిరాజు రాజేశ్వరి, కొత్త రామలక్ష్మి, సుతారి అచ్యుతాంబ, పుతుంబాక అనంత జయప్రదాంబ, ఆలపాటి రామశేషమ్మ, కూనల శివశంకరకుమారి, మొవ్వా రత్నాంబ, జొన్నలగడ్డ గజలక్ష్మి, కొత్త పరిణామ లక్ష్మి సహకారంతో శాశ్వత భవనాన్ని నిర్మించారు. 1969 మార్చి 30న ప్రముఖ స్వాతంత్ర్య యోధురాలు, ఆంధ్ర మహిళాసభ వ్యవస్థాపకురాలు దుర్గాబాయి దేశ్‌ముఖ్‌చే ప్రారంభోత్సవం చేయించారు. దుర్గాబాయ్ దేశ్‌ముఖ్ భర్త చింతామణి డి.దేశ్‌ముఖ్‌తో సహా ఆమె ఈ వేడుకలో పాల్గొన్నారు.



దుర్గాబాయి దేశ్‌ముఖ్‌చే మండలి నూతన భవనం ప్రారంభోత్సవ దృశ్యం (ఫైల్)



సభలో మాట్లాడుతున్న అప్పటి ఎమ్మెల్యే దొడ్డపనేని ఇందిర. పక్కన అన్నాదురై (ఫైల్)

శోభిల్లిన మహిళామండలి

మహిళలు ఎదుర్కొనే వివిధ సమస్యలకు చర్చా వేదికగా, ఆ సమస్యల పరిష్కార దిక్సూచిగా మహిళా మండలి శోభిల్లింది. మహిళలకు పలు రంగాల్లో తోడ్పడుతూ వచ్చింది. ఇక్కడ జరిగే మహిళాభ్యుదయ కార్యక్రమాలకు ఆకర్షితుడైన తమిళనాడు ముఖ్యమంత్రి సి.అన్నాదురై మహిళా మండలిని స్వయంగా సందర్శించారు. నామ మాత్రపు అద్దెకు మహిళా మండలి హాలులో సభలు, సమావేశాల నిర్వహణకు అవకాశం కల్పించారు. తెనాలి రామకృష్ణ కళాక్షేత్రం, సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ హాలు, పెన్షనర్స్ అసోసియేషన్ హాలు...నిర్మాణానికి ముందువరకు తెనాలిలో సభ, సమావేశాలకు మహిళా మండలి వేదికగా నిలిచింది. నందినీ సిద్దారెడ్డి, కె.శివారెడ్డి, దేవీప్రియ, ఆశారాజు...వంటి ఎందరో కవులు ఇక్కడ జరిగిన కవిసమ్మేళనంలో కవితాగానం చేశారు.

1998లో డాక్టర్ ముద్దన కస్తూరిబాయి మహిళా మండలి అధ్యక్ష బాధ్యతలను స్వీకరించారు. కార్యదర్శిగా కొసరాజు ఝాన్సీకుమారి, కోశాధికారి వడ్లమాను లక్ష్మి సహకారంతో డాక్టర్ కస్తూరిబాయి భవన విస్తరణకు కృషిచేశారు. తెనాలి చెందిన ప్రముఖ సినీనటి 'ఊర్వశి' శారద తెనాలి ఎంపీగా ఎన్నికయ్యాక, ఎంపీ ల్యాండ్ నిధులు రూ.1.50 లక్షలను మహిళా మండలికి కేటాయించారు. ఈ మొత్తానికి మరికొంత చేర్చి మహిళా మండలి పై అంతస్తును నిర్మించారు.

ఎన్నింటికో వేదిక

మండలి భవనంలో బాలల గ్రంథాలయం, నృత్యం, సంగీతం, వాద్యసంగీతం, చిత్రలేఖనంలో శిక్షణాలయం నడిచింది. వీటితోపాటు త్యాగరాజ నృత్య కళాశాల, కూచిపూడి నృత్యశిక్షణ కేంద్రం, కుట్టుశిక్షణ కేంద్రం ఈ భవనంలోనే చాలాకాలం నిర్వహించారు. తర్వాతి కాలంలో కుట్లు, ఎంబ్రాయిడరీ శిక్షణనిచ్చారు. మహిళలు, బాలల కోసం గ్రంథాలయం ఇప్పటికీ కొనసాగుతూ వచ్చింది. భవనం పైఅంతస్తులో కొంతకాలం రోటరీ క్లబ్ రక్తనిధి కేంద్రం పనిచేసింది. గతంలో జేఎంజే కాలేజీ ఆధ్వర్యంలో కాన్వెంటు ఇక్కడ నిర్వహించారని చెబుతారు. మున్సిపాలిటీ ఆస్తిపన్ను పెంపుతో మండలి నిర్వహణపై కొంత భారం పడింది. కొత్త కొత్త వేదికలు అందుబాటులోకి రావటంతో ఇక్కడ సభలు, సమావేశాలు తగ్గిపోయాయి. మహిళా మండలి ప్రాభవం కొరవడింది. దీంతో ప్రభుత్వానికి అప్పగించాలని భావించి, ఆ ప్రకారం అమలుచేశారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి

మున్సిపల్ చైర్‌పర్సన్ రాధిక



మాట్లాడుతున్న చైర్‌పర్సన్ రాధిక



ఏఈ ఫణీంద్రకు వార్డు వినతి పత్రం ఇస్తున్న కౌన్సిలర్ లక్ష్మి, శ్రీనివాస్

తెనాలిఅర్బన్: ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక పేర్కొన్నారు. స్వచ్ఛాంధ్ర-2047 కార్యక్రమంలో భాగంగా ఎనిమిదో వార్డులో బుధవారం ఏర్పాటు చేసిన వార్డు సభలో ఆమె మాట్లాడుతూ పట్టణంలో అనేక అభివృద్ధి కార్యక్రమాలు కొనసాగుతున్నాయని చెప్పారు. అలాగే 6,7వ వార్డులలో జరిగిన సభలో కౌన్సిలర్ కొర్రపాటి లక్ష్మి, కూటమి నాయకులు మాట్లాడుతూ తమ ప్రభుత్వం వచ్చిన వంద రోజుల్లో అనేక అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు నిర్వహించినట్లు తెలిపారు. అనంతరం వార్డులో చేపట్టాల్సిన అభివృద్ధి పనులకు సంబంధించిన వినతి పత్రాలను సభల నోడల్ అధికారులకు అందజేశారు. అలాగే సచివాలయ ఉద్యోగులను సన్మానించారు. కార్యక్రమంలో కూటమి నాయకులు డాక్టర్ వేమూరి శేషగిరిరావు, కిషోర్, చదలవాడ వేణు మాధవ్, అంజనేయులు, ప్రశాంతి, చిరంజీవులు, కొర్రపాటి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

చిన్న మరమ్మతులైనా చేయించలేరా.?

వంద రోజుల పాలనలో కనీస పరిష్కారానికి నోచుకోని సమస్యలు



కల్వర్టు గ్రిల్‌పై బండరాళ్లు ఉంచిన దృశ్యం

తెనాలిరూరల్: వంద రోజుల పాలనలో అభివృద్ధి, సంక్షేమంతో కూడిన ప్రజా పాలనను అందించామంటూ కూటమి నేతలు కొద్ది రోజులుగా ప్రచారం చేసుకుంటున్నారు. అయితే వాస్తవ పరిస్థితి ఇందుకు భిన్నంగా ఉంది. పట్టణంలోని వార్డుల్లో రోడ్లు, కల్వర్టులకు చిన్న చిన్న మరమ్మతులైనా చేయించకపోవడంపై విమర్శలు వినిపిస్తున్నాయి. పట్టణ మారిస్‌పేటలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయం సమీపంలో గతంలో ఉన్న తూములను తొలగించి గత ప్రభుత్వ హయాంలో కల్వర్టును నిర్మించారు. కల్వర్టుకు మధ్యలో ఇనుప గ్రిల్‌లను ఏర్పాటు చేశారు. పట్టణంలో ఉన్న ప్రధాన రోడ్లలో ఈ రోడ్డు ఒకటి. భారీ వాహనాలు ఈమార్గంలో వస్తుంటాయి. అయినా అధికారులు ముందు చూపు లేకుండా తక్కువ గేజ్ ఉన్న ఇనుప గ్రిల్‌ను రోడ్డుకు మధ్యలో కల్వర్టుపై ఏర్పాటు చేశారు. మూడు నెలల క్రితం దీనిపై ఓ భారీ వాహనం వెళ్లడంతో ఈ గ్రిల్ వంగిపోయింది. అప్పటి నుంచి దీనిపై రాళ్లు కర్రలు ఉంచుతున్నారు. మినహా పట్టించుకోవడంలేదు.

ప్రమాదకరంగా ఉన్న ఈ గ్రిల్‌పై ప్రస్తుతం బండరాళ్లను ఏర్పాటు చేశారు. దీని వల్ల ట్రాఫిక్‌కు ఇబ్బందులు ఏర్పడుతున్నా అధికారులకు పట్టడం లేదు. ఎక్కువ గేజ్ ఉన్న గ్రిల్ ఏర్పాటు చేయాలంటే ఖర్చు తక్కువే అవుతుంది. కోట్లాది రూపాయలు పన్నుల రూపంలో పురపాలక సంఘానికి వస్తున్నా కనీసం ఇటువంటి చిన్న చిన్న మరమ్మతులు కూడా పాలకులు చేయించకపోవడంపై ప్రజల్లో ఆగ్రహం వ్యక్తమవుతోంది. ఇంతే కాక ఇదే మారిస్‌పేటలోని రెండు గేట్ల మధ్య ప్రధాన రోడ్డులో గోతులను కాంక్రీటుతో పూడ్చకుండా తాత్సారం చేస్తున్నారు. ఈ మార్గంలో తాగునీటి పైపులైను తరచూ లీకవుతోంది. నెలకు ఒకసారైనా రోడ్డును తవ్వి రోజుల తరబడి పనులు చేయాల్సి వస్తోంది. రేషన్ దుకాణానికి సరుకులతో లారీ వచ్చి వెళ్లిందంటే పైపులైను పగులుతోందని స్థానికులు చెబుతున్నారు. తవ్విన గుంతలో ఇసుక/డస్ట్ వేసి పైన రాళ్లు, మట్టితో కప్పితే భారీ వాహనం వచ్చినప్పుడు పైపులైన దెబ్బతినకుండా ఉంటుందని మరమ్మతులు చేస్తున్న వారికి చెబుతున్నా పట్టించుకోవడం లేదంటున్నారు. ఇక్కడా సంబంధిత మున్సిపల్ ఏఈ, వర్క్ ఇన్‌స్పెక్టర్ల పర్యవేక్షణా లోపం స్పష్టమవుతోంది. కేవలం మరమ్మతులు చేయించే పని అప్పగించి అటుగా చూడడం లేదని తెలుస్తోంది. 100 రోజుల పాలనలో ప్రజలకు చేసిందేమి లేదని, గుంతలమయంగా ఉన్న రోడ్లు, లీకవుతున్న పైపులైన్లు వంటివి ప్రజాప్రతినిధులకు కనబడటం లేదని ప్రజలు విమర్శలొస్తున్నాయి. ఇప్పటికైనా మునిసిపల్ అధికారులు స్పందించాల్సిన అవసరం ఉంది.

సంస్కృతీ సంప్రదాయాలపై అవగాహన అవసరం



విద్యార్థులతో మాట్లాడుతున్న హేమశంకరరావు

రేపల్లె రూరల్: చిన్నారుల్లో దేశ సంస్కృతి సంప్రదాయాలపై అవగాహన కలిగి ఉండాలని సమరసత సేవా ఫౌండేషన్ జిల్లా ధర్మప్రచారక్ జంజనం హేమశంకరరావు చెప్పారు. సమరసన సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో పట్టణంలోని 1వవార్డు శ్రీరామ్‌నగర్ ఎస్టీకాలనీలో నెలకొల్పిన బాల వికాస్ కేంద్రాన్ని బుధవారం ఆయన సందర్శించి మాట్లాడారు. భారతీయ సంప్రదాయాలపై విద్యార్థులకు గురువులు అవగాహన కల్పించాలని సూచించారు. అనంతరం చిన్నారులతో మాట్లాడారు. పలు ప్రశ్నలు వేసి సమాధానాలు రాబట్టారు. కార్యక్రమంలో ఫౌండేషన్ మండల కన్వీనర్ పేరం కోటేశ్వరరావు, సభ్యులు నంబూరు వేణు, రమాదేవి, మాతాజీ గున్నం అనూష పాల్గొన్నారు.

నేడు చిత్రకారుడు చిదంబరేశ్వర రావుకు..
'దర్శనాచార్య' కొండూరు అవార్డు ప్రదానం



పావులూరి చిదంబరేశ్వరరావు



డాక్టర్ కొండూరు వీరరాఘవాచార్యులు

తెనాలి: 'దర్శనాచార్య' డాక్టర్ కొండూరు వీరరాఘవాచార్యులు 112వ జయంతిని గురువారం తెనాలిలో నిర్వహించనున్నారు. స్థానిక నెహ్రూరోడ్డులోని శాఖాగ్రంథాలయంలోని కవిరాజు త్రిపురనేని భవనంలో సాయంత్రం 5 గంటలకు ఏర్పాటయే సభకు రవీంద్రపీఠం అధ్యక్షుడు డాక్టర్ అయినాల మల్లేశ్వరరావు అధ్యక్షత వహిస్తారు. ఆంధ్రప్రదేశ్ విశ్వబ్రాహ్మణ పురోహిత సంఘం అధ్యక్షుడు ఆరికట్ల గోవర్ధనశాస్త్రి డాక్టర్ కొండూరు వీరరాఘవాచార్యుల స్మారకోపన్యాసం చేస్తారు. ఇదే సభలో విజయవాడకు చెందిన ప్రముఖ చిత్రకారుడు పావులూరి చిదంబరేశ్వరరావుకు డాక్టర్ కొండూరు అవార్డుతో సత్కరిస్తారు. ఈఎల్‌వీ అప్పారావు, పావులూరి శ్రీనివాసరావు, లైబ్రేరియన్ కావూరి రమాదేవి పాల్గొంటారు. డాక్టర్ కొండూరు వీరరాఘవాచార్యులు ధర్మనిధి, ఆలపాటి కళావతి రవీంద్రపీఠం ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తారు.

చిత్రకళలో ప్రత్యేకం చిదంబరేశ్వరరావు...

అవార్డుగ్రహీత పావులూరి చిదంబరేశ్వరరావు 1964లో మంచిలీపట్నంలో జన్మించారు. మద్రాస్ ప్రభుత్వం వారి ఫ్రీహ్యాండ్ అవుట్‌లైన్ డ్రాయింగ్‌లో ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణులయ్యారు. మచిలీపట్నంలోనే బీఎస్సీ చేశారు. గుంటూరులో టీచర్ ట్రైనింగ్ కోర్సు చేశారు.1985 నుండి ఒక దినపత్రికి పబ్లికేషన్స్‌లో చిత్రకారుడిగా ఉద్యోగంలో చేరారు. కథలు, సీరియల్స్‌కు బొమ్మలు వేస్తూ 2000 వరకు కొనసాగారు. 2007 నుంచి టీవీ మీడియాలోకి ప్రవేశించారు. ప్రైవేట్‌గా మోరల్ స్టూడియో వారి వేమన పద్యాలకు యానిమేషన్ చిత్రాలను రచించారు. సినిమాలకు టైటిల్ రాయటం వీరి మరో ప్రత్యేకత. దేశంలోని వివిధ నగరాల్లో వీరి చిత్రాలు ప్రదర్శనలకు నోచుకున్నాయి. నడివయసులో ఫైనార్ట్స్‌లో డిగ్రీ చేసి ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణులయ్యారు. తన కృషికి గుర్తింపుగా పలు పురస్కారాలను అందుకున్నారు.

గానగంధర్వుడి జీవితం యువతకు ఆదర్శం

తెనాలి: ఎంచుకున్న రంగంలో సాధనతో శిఖరాగ్రాలకు చేరిన గానగంధర్వుడు ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం జీవితం నేటి యువతరానిక ఆదర్శమని వివేక విద్యాసంస్థల డైరెక్టర్, తెనాలి ఛిల్డ్రన్ ఫిలిం సొసైటీ అధ్యక్షుడు డాక్టర్ రావిపాటి వీరనారాయణరావు అన్నారు. అమరమైన ఆయన గాత్రం రసమయ పవిత్రగంగాప్రవాహంలా సాగుతూ, ఆ సంగీత ఝరిని ఆస్వాదించిన ప్రతి హృదయం ఆనందంతో మరపురాని ఆనందాన్ని అనుభవిస్తుందని చెప్పారు. స్థానిక నాజరుపేటలోని వివేక పబ్లిక్ స్కూల్ మీటింగ్ హాలులో బుధవారం సాయంత్రం ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం నాలుగో వర్ధంతిని నిర్వహించారు. తెనాలి కల్చరల్ ఫిలిం సొసైటీ కార్యదర్శి బొల్లిముంత కృష్ణ, గాయకుడు నీలాంబరంను సత్కరించారు. సభానంతరం ఎస్పీ బాలు పాటలతో సంగీత విభావరిని నిర్వహించారు. ఎస్పీ బాలు జీవిత విశేషాలను సభాధ్యక్షుడు డాక్టర్ వీరనారాయణరావు వివరించారు. గాయకుడిగా, నటుడిగా, సంగీత దర్శకుడిగా, డబ్బింగ్ ఆర్టిస్ట్‌గా, 'పాడుతా తీయగా'తో ఎందరో గాయనీగాయకులను వెలుగులోకి తెచ్చిన ఉత్తమ గురువుగా బాలసుబ్రహ్మణ్యం తెలుగు సినీప్రేక్షకుల మదిలో చిరస్థాయిగా ఉంటారని చెప్పారు. వివేక విద్యాసంస్థల ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డాక్టర్ కె.రామరాజు తన ప్రసంగంలో 43 వేలకు పైగా పాటలు పాడిన బాలసుబ్రహ్మణ్యం పద్మశ్రీ, పద్మభూషణ్ వంటి అత్యున్నత పురస్కారాలను అందుకున్నారని గుర్తుచేశారు. ఆయన మరణానంతరం 2021లో కేంద్రప్రభుత్వం పద్మవిభూషణ్ పురస్కారాన్ని ప్రకటించిందని చెప్పారు. తొలుత ఎస్పీ బాలు చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు.



అన్నదానం చేస్తున్న నిర్వాహకులు



బాలసుబ్రహ్మణ్యం చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న అభిమానులు

పేదలకు అన్నదానం

గానగంధర్వుడు స్వర్గీయ ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం 4వ వర్ధంతి సందర్భంగా బుధవారం స్థానిక రైల్వేస్టేషను సెంటరులోని శ్రీ శివలింగేశ్వరస్వామి భక్తబృంద సేవాసమితి అన్నదాన కేంద్రంలో వృద్ధులు, నిరాశ్రయులకు అన్నదానం చేశారు. ఎస్పీ బాలు అభిమాని కోట అక్కేశ్వరరావు ఆధ్వర్యంలో జరిగిన అన్నదానానికి ముందు ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. ఆయన గానమాధుర్యాన్ని స్మరించుకున్నారు. కోట అక్కేశ్వరరావు, నన్నపనేని రాంబాబు, సేవాసమితి అధ్యక్షుడు కుర్రా శ్రీను మాట్లాడారు. న్యాయవాది సురేష్, మాజీ కౌన్సిలర్ కరేటి వీరయ్య, వెంకటేశ్వరరావు, కోట తిరుమలరావు, కోట మణికంఠ, నాగిశెట్టి సాయిచరణ్, షేక్ మాలిక్, యలవర్తి సాంబశివరావు పాల్గొన్నారు.

స్కూల్స్‌గేమ్స్‌లో విద్యార్థుల సత్తా

భట్టిప్రోలు: చుండూరు మండలం యడ్లపల్లి ఆలపాటి వెంకట్రామయ్య జిల్లా పరిషత్ హైస్కూల్‌లో బుధవారం నిర్వహించిన స్కూల్‌గేమ్స్ జిల్లా స్థాయి ఆటలు పోటీలు, అథ్లెటిక్స్‌లలో భట్టిప్రోలు మండలం పెసర్లంక దేవభక్తుని కోటయ్య జెడ్పీ హైస్కూల్, సూరేపల్లి వీపీ అండ్ జీఎస్ఎం హైస్కూల్ విద్యార్థులు సత్తా చాటారు. పెసర్లంక హైస్కూల్ నుంచి షాట్‌పుట్, డిస్క్ త్రోలో ఎస్.సంతోష్ ప్రథమ, 100, 200, 400 మీటర్ల విభాగాలలో కె.నిహారిక ప్రథమ స్థానంలో నిలిచారు. సూరేపల్లి హైస్కూల్ నుంచి షాట్‌పుట్, డిస్క్‌త్రో విభాగాలలో వి.చైతన్య ప్రథమ స్థానం, డిస్క్ త్రోలో బి.గీతికాశ్రీ, 100 మీటర్ల రన్నింగ్, లాంగ్ జంప్‌లో జె.నితీష డిస్క్ త్రోలో ఎం.అభిరామ్ ద్వితీయ స్థానం, 400, 200, 800 మీటర్ల రన్నింగ్‌లో కె.ప్రవల్లిక ద్వితీయ స్థానం సాధించారు. వీరికి శిక్షణ ఇచ్చిన ఫిజికల్ డైరెక్టర్ దాసరి వెంకట ప్రసాద్, పీఈటీ నాగేశ్వరరావు, ప్రతిభ చూపిన బాలబాలికలను ప్రధానోపాధ్యాయులు ఎస్‌కె మహబూబ్ భాషా, కె. శ్రీనివాస శర్మ, ఉపాధ్యాయులు అభినందించారు. ప్రతిభ చూపిన బాలబాలికలు ఈనెల 27న జిల్లా స్థాయిలో జరిగే పోటీలలో పాల్గొననున్నారు.

తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు

ఏడీఏ ఉషారాణి



తెనాలిరూరల్: తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు సాధించవచ్చని తెనాలి వ్యవసాయ శాఖ ఏడీఏ ఎస్. ఉషారాణి తెలిపారు. పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా తెనాలి మండలం ఖాజీపేట, హాఫ్‌పేట గ్రామాల్లో వ్యవసాయశాఖ అధికారులు బుధవారం పర్యటించారు. పొలాలను పరిశీలించి గ్రామ సభలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏడీఏ మాట్లాడుతూ యాజమాన్య పద్ధతులు పాటించడం ద్వారా వరిలో అధిక దిగుబడులు సాధించవచ్చన్నారు. సూడోమోనాస్ ఫ్లోరిసెన్స్, జీవ ఎరువులు వాడాలని సూచించారు. రైతులందరూ ఈకేవైసీఈ నమోదు చేయించుకుని, ఈ-పంటలో వివరాలను నమోదు చేయించుకోవాలని చెప్పారు. ఘన జీవామృతం, ద్రవ జీవామృతంల గురించి వివరించారు. క్షేత్ర సందర్శనకు వెళ్లి పొలాలను పరిశీలించగా చీడ పీడలు, నాము తెగులును గుర్తించి నివారణ చర్యల గురించి రైతులకు వివరించారు. మండల వ్యవసాయశాఖాధికారి జి. ప్రేమ్‌సాగర్, ఏఈవో గడ్డం మోహన్, వీపీఏలు వంశబు. నాగేంద్ర, శివతేజ, ప్రకృతి వ్యవసాయం నుండి రేణుక, పశుసంవర్ధక శాఖ లైవ్‌స్టాక్ అసిస్టెంట్ ఖయ్యూమ్, రైతులు పాల్గొన్నారు.

ఆన్‌లైన్‌లో నమోదు కాకున్నా పంట నష్టపరిహారం ఇవ్వాలి



కొల్లూరు: ఆన్‌లైన్‌లో నమోదు కాని పొలాల్లో దెబ్బతిన్న పంటలకూ పరిహారం ఇవ్వాలని రైతులు డిమాండ్ చేశారు. ఈపూరుకు చెందిన రైతులు బుధవారం రెవెన్యూ కార్యాలయంలో ఆన్‌లైన్‌లో లేని భూములకు పంట నష్ట నమోదు చేయడంలో అధికారులు తాత్సారం చేస్తున్నారని, వెంటనే నష్టం నమోదు చేయాలని ఆర్ఐ త్రివేణికి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ అమృతలూరు కృపానందం, రైతులు పాల్గొన్నారు.

ఐ క్లినిక్ ప్రారంభం



నిజాంపట్నం: అధునాతన పరికరాలతో నిర్వహిస్తున్న కంటి పరీక్షలను ప్రజలు సద్వినియోగ పరుచుకోవాలని ఎస్ఐ కె.తిరుపతి రావు కోరారు. నిజాంపట్నంలో బుధవారం అక్షయ్ ఐ క్లినిక్ సెంటర్‌ను ఎస్ఐ తిరుపతి రావు ప్రారంభించి మాట్లాడారు. అనంతరం ప్రారంభోత్సవం సందర్భంగా రోగులకు ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో అక్షయ్ ఐ క్లినిక్, ఆప్టికల్స్ ప్రతినిధులు శరత్‌బాబు తదితరులు పాల్గొన్నారు.